sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 28-08-2026 శుక్రవారం | సంపుటి-02 సంచిక : 139 EDITOR: ROHINI



6 కోట్లు కట్టి... 22 వేల కోట్లు ఎగ్గొట్టి

22 వేల కోట్ల అప్పుకు 6 కోట్లతో సెటిల్మెంట్

- జీ గ్రూప్ అధినేత సుభాష్ చంద్రకు గులాం
- నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ తీర్పు
- బ్యాంకులు, ఎల్ఐసీలకు శరగోపం
- బడా బాబుల దందాకు చట్టాల అండ

ఇరవై రెండు వేల కోట్ల అప్పు ఉంటే కేవలం ఆరున్నర కోట్లు కట్టి బయటపడటం బడా బాబులకే చెల్లింది. సామాన్యులకి చట్టాలు ఉరితాళ్లుగా మారుతుంటే, దిగ్గజాలకు మాత్రం అవే చట్టాలు రక్షణ కవచాలవుతున్నాయి. జీ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర కేసులో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు దేశ ఆర్థిక వ్యవస్థను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.

- సహనం వందే, హైదరాబాద్

భారతీయ కార్పొరేట్ వర్గాలను కుదిపేస్తున్న తాజా పరిణామం జీ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా కేసుకు సంబంధించింది. ఈ కేసును పరిశీలిస్తే ఎవరికైనా మైండ్ బ్లాంక్ అవ్వాల్సిందే. సుభాష్ చంద్ర అప్పు మొత్తం అక్షరాల 22 వేల కోట్ల రూపాయలు. కానీ ట్రిబ్యునల్ ఆమోదించిన సెటిల్మెంట్ అమౌంట్ కేవలం 6.5 కోట్ల రూపాయలు మాత్రమే. అంటే అప్పులు ఇచ్చిన వారికి దాదాపు 99.97 శాతం మేర భారీ నష్టం వాటిల్లింది. ఇంతటి భారీ వ్యత్యాసంతో కూడిన రీపేమెంట్ ప్లాన్‌కు ట్రిబ్యునల్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఇప్పుడు ఆర్థిక రంగంలో తీవ్ర చర్చనీయాంశమైంది.

వ్యాపార సామ్రాజ్యం

జీ గ్రూప్ వ్యవస్థాపకుడిగా సుభాష్ చంద్ర సాధించిన విజయాలు ఒకప్పుడు టీవీ రంగంలో విప్లవం సృష్టించాయి. కానీ అదే విజయాల ముసుగులో జరిగిన భారీ ఆర్థిక అవకతవకలు ఇప్పుడు దేశ ఆర్థిక మూలాలను కదిలిస్తున్నాయి. కంపెనీలను, బ్యాంకులను నిండా ముంచిన తర్వాత కూడా బయటపడే మార్గాలు కార్పొరేట్ శక్తులకు మాత్రమే ఎలా సాధ్యమవుతున్నాయనే కోపంతో ప్రజలు రగిలిపోతున్నారు.

బ్యాంకులు... ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ రుణం

సుభాష్ చంద్ర తన వ్యాపార అవసరాల కోసం వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి విపరీతంగా అప్పులు తీసుకున్నారు. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ వంటి పెద్ద సంస్థలు ఆయనకు భారీగా రుణాలు ఇచ్చాయి. కాలక్రమేణా ఆ అప్పులు తిరిగి చెల్లించలేనంతగా పెరిగిపోయి మొండి బకాయిలుగా మారిపోవడంతో ఈ వ్యక్తిగత దివాలా ముద్ర ఆయనకు చుట్టుకుంది.

బెంచ్‌లో విభేదాలు

ఈ తీర్పు వెలువడటానికి ముందే ట్రిబ్యునల్ బెంచ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఒరిజినల్ బెంచ్‌లోని ఇద్దరు సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మూడో సభ్యుడిగా జ్యుడీషియల్ మెంబర్ నీలేష్ శర్మ రంగంలోకి దిగారు. ఆయన జోక్యంతో ఈ విచారణ కొలిక్కి వచ్చింది. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నేతృత్వంలోని కొన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని, ఏమాత్రం ఆచరణ సాధ్యం కానిదని వాదించినప్పటికీ ఆ వాదనలను ట్రిబ్యునల్ పక్కన పెట్టింది.

మాల్యా విమర్శలు

ఈ పరిణామంపై దేశవ్యాప్తంగా విమర్శలు వస్తున్న తరుణంలో పరారీలో ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యా ఎక్స్ వేదికగా స్పందించడం మరింత హాట్ టాపిక్‌గా మారింది.

తనకు 6203 కోట్ల రూపాయల అప్పు ఉంటే, బ్యాంకులు, ప్రభుత్వం తన నుంచి ఏకంగా 14,100 కోట్ల రూపాయలను రాబట్టినట్లు అంగీకరించాయని పేర్కొన్నారు. అసలు బాకీ కంటే రెండింతలకు పైగా వసూలు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. కానీ తన విషయంలో ఉన్న నిబంధన లు ఇతరులకు వర్తించలేదని, చాలా మంది బకాయిదారులు ఇలాగే నామమాత్రపు మొత్తాలతో సెటిల్ చేసుకుంటున్నారని మాల్యా మండిపడ్డారు.


జీ గ్రూప్ అధినేత సుభాష్ చంద్ర

పాడె కడుతున్న విదేశీ బ్రాండ్లు

అమెరికాకు ఆరోగ్యం... ఇండియాకు విషం

- ఒకే కంపెనీ... ఒకే ఉత్పత్తి... నాణ్యత వేరు
- విదేశాల్లో నాణ్యత... భారతదేశంలో మోసం
- నాసిరకపు పదార్థాలతో ఉత్పత్తుల తయారీ
- చిన్న అక్షరాల వెనుక పెద్ద పన్నాగం

విదేశాలలో ఆరోగ్య నిబంధనలతో తయారయ్యే ఫాంటా, బోర్న్‌విటా, మాగీ వంటి ఉత్పత్తులు మన దేశంలో మాత్రం భారీ షుగర్‌తో, హానికరమైన పదార్థాలతో ఎందుకు తయారవుతున్నాయి? మన దేశ ప్రజల పట్ల ఎందుకు అంత చులకన? మన ఆరోగ్యం పట్ల బడా కంపెనీలకు బాధ్యత లేదా? - సహనం వందే, హైదరాబాద్

చిన్న అక్షరాల వెనుక పన్నాగం

ఫాంటా, మాగీ, కిట్‌క్యాట్, బోర్న్‌విటా వంటి ప్రముఖ బ్రాండ్లు ప్రపంచవ్యాప్తంగా దొరుకుతాయి. కానీ వీటి తయారీలో ఉపయోగించే పదార్థాలు దేశాన్ని బట్టి పూర్తిగా మారిపోతుంటాయి. ఉదాహరణకు యూరప్ దేశాల్లో విక్రయించే ఫాంటాలో సహజమైన పండ్ల రసం మోతాదు ఎక్కువగా ఉంటుంది. అదే మన దేశంలోకి వచ్చేసరికి ఆర్టిఫిషియల్ ఫ్లేవర్లు, రంగులు, భారీ స్థాయిలో పంచదారను కలుపుతారు. దీనివల్ల రుచిలో తేడా రావడం మాత్రమే కాకుండా మన ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతుంది.

పిల్లల ఆరోగ్యాన్ని తాకట్టుపెట్టే చక్కెర

బోర్న్‌విటా ఉదంతం చూస్తే ఈ విషయం మరింత స్పష్టంగా అర్థమవుతుంది. కొద్ది కాలం క్రితం దీనిలో మోతాదుకు మించిన చక్కెర శాతం ఉండడంపై పెద్ద వివాదమే చెలరేగింది. పిల్లల ఎదుగుదల కోసం రోజూ తాగించే హెల్త్ డ్రింక్స్‌లో ఇంత భారీ మొత్తంలో షుగర్ ఉండటం ఆరోగ్యానికి ప్రమాదకరమని నిపుణులు హెచ్చరించారు.

విదేశాల్లో విక్రయించే ఇదే ఉత్పత్తులలో పోషక విలువలు మెరుగ్గా ఉంటున్నప్పటికీ, మన దేశ మార్కెట్లలో మాత్రం పంచదార మోతాదు ఎక్కువగా ఉంటోంది.

చట్టాల లొసుగులతో సాగే వ్యాపారం

మాగీ నూడుల్స్ విషయంలోనూ ఇదే తంతు కనిపిస్తుంది. వివిధ దేశాల్లోని ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సోడియం, మైదా మోతాదుపై పరిమితులు విధిస్తాయి. కానీ మన దేశంలో మాత్రం బ్రాండ్లు స్థానిక రుచులకు అనుగుణంగా మార్పులు చేస్తూనే, హానికరమైన పదార్థాలను నియంత్రించడంలో వెనుకడుగు వేస్తున్నాయి. చట్టాలలోని లొసుగులను ఆసరాగా చేసుకుని కంపెనీలు మన దేశ ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్నాయి.

ఇక్కడ అసలు సమస్య కేవలం పదార్థాల నాణ్యత మాత్రమే కాదు, వినియోగదారుడికి నిజాలు తెలియకపోవడం. విదేశాలలో ప్యాకెట్లపై స్పష్టమైన హెచ్చరికలు ముద్రించడం తప్పనిసరి. ఏయే పదార్థాలు ఎంత మోతాదులో ఉన్నాయి, ఆరోగ్యానికి ఏది ప్రమాదకరమో ముందుగానే పెద్ద అక్షరాలతో చూపిస్తారు. కానీ మన దేశంలో మాత్రం ఇప్పటికీ ప్యాకెట్ల వెనుక భాగంలో చిన్న చిన్న అక్షరాలతో ఎవడూ చదవని రీతిలో ముద్రించి చేతులు దులుపుకుంటున్నారు.

వార్నింగ్ లేబుళ్లను వ్యతిరేకిస్తున్న వైనం

దీనికోసమే ప్రపంచవ్యాప్తంగా ఫ్రంట్-ఆఫ్-ప్యాక్ వార్నింగ్ లేబుల్స్ విధానం తెరపైకి వచ్చింది. ప్యాకెట్ వెనుక కాదు, సరిగ్గా ముందు భాగంలోనే ఎరుపు రంగు గుర్తుతో ఈ పదార్థంలో ఎంత షుగర్, ఉప్పు లేదా కొవ్వు ఉందని హెచ్చరించడమే ఈ విధానం ఉద్దేశం. చిప్స్, కూల్ డ్రింక్స్, చాక్లెట్లు కొనేటప్పుడే సామాన్యుడికి అది ఎంత ప్రమాదకరమో ఇట్టే అర్థమైపోతుంది. ప్రపంచంలోని ఎన్నో దేశాలు ఇప్పటికే ఈ లేబుల్స్ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తుంటే, మన దేశంలో కోట్లాది రూపాయల వ్యాపారం చేసే పెద్ద పెద్ద ఫుడ్ కార్పొరేషన్లు ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

కార్పొరేట్ లాభాల వేటలో మన ఆరోగ్యం

ప్యాకెట్ల ముందు భాగంలో ప్రమాదకరమైన హెచ్చరికలు ఉంటే తమ అమ్మకాలు పడిపోతాయని, వ్యాపారం దెబ్బతింటుందని ఆ కంపెనీలు ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నాయి. ఏ దేశపు పౌరులైనా వారికి లభించే ఆహార నాణ్యత ఒకేలా ఉండాలి.

ప్రధాని పీఠంపై దళపతి కన్ను

ఢిల్లీకి దూసుకొస్తున్న విజయ్

- మూడో స్థానంలో తమిళనాడు సీఎం
- మొదట మోడీ... రెండో స్థానం రాహుల్
- దేశాన్ని కుదిపేస్తున్న ఇండియా టుడే సర్వే
- ఎన్నికలు వస్తే మోడీకే మళ్లీ అధికార పీఠం
- కాక్రోచ్ జనతా 'పార్టీ'గా మారకూడదన్న జనం

రాజకీయాల్లో ఎప్పుడు ఎవరు ఎలాంటి సంచలనాలు సృష్టిస్తారో ఊహించడం కష్టం. సరిగ్గా ఇదే నిజమని నిరూపిస్తూ తమిళనాడులో పార్టీ పెట్టి అనతికాలంలోనే సీఎంగా పీఠం ఎక్కిన జోసఫ్ విజయ్ ఇప్పుడు ఏకంగా జాతీయ రాజకీయాల్లో ప్రధాని రేసులో మూడో స్థానానికి దూసుకొచ్చారు. ఇండియా టుడే మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో వెల్లడైన ఈ సంచలన విషయాలు దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. - సహనం వందే, న్యూఢిల్లీ

తమిళనాడులో టీవీకే పార్టీని స్థాపించి రెండేళ్లలోపే సీఎంగా బాధ్యతలు చేపట్టిన విజయ్ జాతీయ స్థాయిలోనూ తన పాపులారిటీని అసాధారణ రీతిలో పెంచుకుంటున్నారు. 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో దేశ ప్రధానిగా ఎవరు ఉంటే బాగుంటుందనే ప్రశ్న ఎదురైనప్పుడు, ఏకంగా 9.2 శాతం మంది ప్రజలు విజయ్ వైపు మొగ్గు చూపారు. ఒక ప్రాంతీయ పార్టీ అధినేత, కేవలం ఇటీవలే రాజకీయాల్లోకి వచ్చిన నాయకుడు ప్రధాని రేసులో మూడో స్థానంలో నిలవడం విశేషం. ఈ ప్రధాని అభ్యర్థుల జాబితాలో మొదటి రెండు స్థానాల్లో నరేంద్ర మోదీ 48.7 శాతం మద్దతుతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, 27.1 శాతం మద్దతుతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రెండో స్థానంలో నిలిచారు. రాహుల్ గాంధీ తర్వాత ప్రధాని అభ్యర్థిగా జనం విజయ్‌ను ఎంచుకోవడం గమనార్హం. విజయ్ దూకుడు చూస్తుంటే రాబోయే రోజుల్లో జాతీయ రాజకీయాల్లో ఆయన పాత్ర మరింత కీలకం కానుందని స్పష్టమవుతోంది.

వెనక్కి తగ్గిన జాతీయ దిగ్గజాలు

ప్రధాని రేసులో మూడో స్థానంలో ఉన్న విజయ్... మిగతా జాతీయ, ప్రాంతీయ దిగ్గజ నేతలందరినీ ఆయన వెనక్కి నెట్టేశారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి కేవలం 2 శాతం ఓట్లు మాత్రమే రాగా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌కు 1.7 శాతం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు 1.2 శాతం మద్దతు మాత్రమే లభించింది. అంటే ఈ సీనియర్ నాయకులందరికంటే విజయ్ ఎంతో ముందంజలో ఉన్నారన్నమాట. అంతేకాదు ప్రతిపక్ష కూటమికి నాయకత్వం వహించడానికి ప్రస్తుత ప్రతిపక్ష నాయకులలో ఎవరు అత్యంత సమర్థులని ప్రశ్నిస్తే, విజయ్ ఏకంగా 12.2 శాతం ఓట్లతో మరోసారి సత్తా చాటారు. ఈ విభాగంలోనూ రాహుల్ గాంధీ 29 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, విజయ్ ఆ తర్వాతి స్థానంలో నిలిచి అందరి దృష్టిని తనవైపునకు తిప్పుకున్నారు.

మళ్లీ ఎన్డీయేదే అధికార పీఠం

మరోవైపు దేశంలో ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే ఫలితాలు ఎలా ఉంటాయనే దానిపై కూడా ఈ సర్వేలో స్పష్టమైన అంచనాలు వెలువడ్డాయి. కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన విద్యార్థుల ఆందోళనలు, ఢిల్లీలో జరిగిన నిరసనల తర్వాత ఎన్డీయేకు కొన్ని ఎదురుదెబ్బలు తగిలిన మాట వాస్తవమే. అయితే ఎన్నికలు జరిగితే నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి మరోసారి తన ప్రభుత్వాన్ని ఘనంగా నిలబెట్టుకుంటుందని సర్వే తేల్చి చెప్పింది. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన సర్వేలో ఎన్డీయేకు 352 సీట్లు వస్తాయని అంచనా వేయగా, తాజా సర్వేలో అది 326 సీట్లకు పడిపోయింది. అంటే ఎన్డీయే కూటమి సుమారు 26 ఎంపీ సీట్లను కోల్పోయే అవకాశం ఉంది. అయినప్పటికీ మెజారిటీ మార్క్‌ను సులభంగా దాటి మరోసారి కేంద్రంలో పీఠం కైవసం చేసుకునే బలమైన స్థితిలోనే ఎన్డీయే ఉండటం గమనార్హం.

ఇండియా కూటమికి ఆశించిన సీట్లు లేవు...

ఇక విపక్ష ఇండియా కూటమి విషయానికి వస్తే... ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఆ కూటమికి 185సీట్లు లభిస్తాయని సర్వే అంచనా వేసింది. ఈ ఏడాది జనవరిలో ఈ సంఖ్య 182గా ఉండేది. గత సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి సాధించిన 234 సీట్లతో పోల్చి చూస్తే, ప్రస్తుత అంచనాలు ఆశించిన స్థాయిలో లేవనే చెప్పాలి.ఇక దేశ యువత, జెన్-జీ మనస్తత్వాన్ని పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి.